క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 14న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. కాశిబుగ్గ, శాంతినగర్, మదీనా రోడ్డు, హరి రమాదేవి క్లినిక్, శ్రీనివాస వీధి, తిలక్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కేయూ హెల్త్ సెంటర్‌కు మెడికల్ ఆఫీసర్ నియామకం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని హెల్త్ సెంటర్‌కు నూతన మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కె.శంకర్‌ను నియమించారు. ఈ మేరకు వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌తోపాటు హనుమకొండ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని హెల్త్ సెంటర్‌లోనూ సేవలందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా సురేందర్



హన్మకొండ: బీసీ యువజన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా పాండవుల సురేందర్‌ను నియమించినట్లు బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ తెలిపారు. బీసీ కులాల ఐక్యతకు చేస్తున్న కృషిని గుర్తించి హనుమకొండ వడ్డెపల్లికి చెందిన సురేందర్‌ను అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సివిల్ సర్వీస్‌కు ఎంపికైన విక్రమ్‌కు ఘన సన్మానం

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.సుదర్శన్ కుమారుడు విక్రమ్.. సివిల్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు విక్రమ్‌ను జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్, తదితరులు బుధవారం సన్మానించారు.

ముంపు బాధితులకు చేయూత



ఖిలా వరంగల్: ముంపు ప్రాంతాల బాధితులకు పద్మశాలి సంఘం అధ్యక్షుడు గడ్డం రవి, సామాజిక వేత్త మేరుగు అశోక్ బుధవారం చేయూతనందించారు. ముంపునకు గురైన వరంగల్ 34, 35వ డివిజన్లలోని శివనగర్, మైసయ్య నగర్ వాసులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం అందజేశారు. 120 మందికి బియ్యం, ఎంపిక చేసిన 300 మంది కుటుంబాలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో అంకతి అఖిల్, గటిక రాంచందర్, రోషన్, కస్తూరి రాహుల్, గడ్డం సాయి, బొమ్మగాని అజయ్, వినయ్, ధనుష్, దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహార ప్యాకెట్ల పంపిణీ

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, రైల్వే పరిసర ప్రాంతాల్లో జీసస్ ప్రేయర్ హాల్ అధ్యక్షుడు పాస్టర్ మరియదాస్ ఆధ్వర్యంలో అభాగ్యులకు బుధవారం ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పసునూరి మనోహర్, కొడవటి రవి, ఉడుతల బాబురావు, నవీన్‌రెడ్డి, కృష్ణకుమార్, రాజేంద్రప్రసాద్, రాజు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



హసన్‌పర్తి: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ముచ్చర్లకు చెందిన బొక్క నీల కుటుంబానికి శ్రీసాయి స్వచ్ఛంద సంస్థ చేయూతనిచ్చింది. ఈ మేరకు మృతురాలి కుటుంబానికి బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను బుధవారం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానికులు ఇంద్రాసేనారెడ్డి, శ్రీధర్, హరిప్రసాద్ రెడ్డి, దామెర శంకర్, సుధాకర్, మొగిలి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన ఇల్లు



ఖిలా వరంగల్: మంగళవారం కురిసిన భారీ వర్షాలకు గోడలు నానిన పురాతనమైన పెంకుటిల్లు బుధవారం నేలమట్టమైంది. వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్ రామస్వామి గుడి ప్రాంతానికి చెందిన బారే నాగమణి – శంకర్‌కు చెందిన ఇల్లును కార్పొరేటర్ మరుపల్లి రవి, రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

కాజీపేట రైల్వే జంక్షన్ గుంతలమయం



కంకర తేలిన కాజీపేట రైల్వే బస్టాప్ రోడ్డు



వర్షానికి రోడ్డు దెబ్బతిని గుంతల్లో నిలిచిన నీరు



అధ్వానంగా మారిన బస్టాప్ రోడ్డు

- భారీ వర్షాలకు అధ్వానంగా మారిన రోడ్లు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జంక్షన్ గుంతలమయంగా మారింది. ముఖ్యంలో ఆర్టీసీ (బస్ బే) బస్టాప్ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. దాంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాజీపేట జంక్షన్‌లో రైలు దిగిన ప్రయాణికులు ఈ బస్టాప్‌కు వచ్చి సిటీ బస్సులు, ఆటోలు ఎక్కి వివిధ గ్రామాలు, హనుమకొండ, వరంగల్ బస్టాండ్లకు వెళ్తుంటారు. అదేవిధంగా త్రినగరంతో పాటు వివిధ గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులు, వివిధ వాహనాల ద్వారా రైళ్ల కోసం కాజీపేట జంక్షన్‌కు చేరుకుంటారు. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, ప్రయాణికులు, వాహనదారులతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. అలాంటి రోడ్డు గుంతలమయంగా మారి వర్షపు నీరు నిలవడంతో ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో కాజీపేట జంక్షన్‌లోని రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

వైభవంగా పోచమ్మ తల్లి బోనాలు



గోకుల్‌నగర్‌లోని పోచమ్మ ఆలయం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ఖిలా వరంగల్: బుడగ జంగాల కాలనీలో బోనాలు సమర్పిస్తున్న మహిళలు



కాజీపేట: బోనాలతో తరలివెళ్తున్న మహిళలు

హన్మకొండ: హనుమకొండ గోకుల్ నగర్‌లోని పోచమ్మ దేవాలయానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం బుధవారం కావడంతో చుట్టుపక్కల కాలనీలకు చెందిన భక్తులు బోనాలతో పోచమ్మ దేవాలయానికి చేరుకుని తల్లికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు చాతబోయిన వెంకన్న, బొంగు రాజు యాదవ్, బంక రమేష్ యాదవ్, బంక సతీష్, బంక చందు, వలంటీర్లు పాల్గొన్నారు.

రైల్వేగేట్ ప్రాంతంలో..

ఖిలా వరంగల్: శ్రావణమాసం సందర్భంగా వరంగల్ రైల్వేగేట్ ప్రాంతంలోని పెరకవాడ, శివనగర్, శాంతినగర్, ఏకశిల నగర్, శంభునిపేట, బుడగ జంగాల కాలనీ, గిరిప్రసాద్ నగర్, విశ్వనాథ కాలనీతోపాటు త్రికోటలోని ప్రజలు భక్తిశ్రద్ధలతో పోచమ్మతల్లి బోనాలను బుధవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

సందడిగా పోచమ్మ బోనాలు

కాజీపేట: కాజీపేట పట్టణంలో పోచమ్మ బోనాల వేడుకలను భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. పట్టణంలోని సోమిడి, ప్రశాంత్‌నగర్, సిద్ధార్థనగర్, బాపూజీనగర్, వెంకటాద్రి నగర్ కాలనీల్లోని పోచమ్మ తల్లి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

కనీస వేతనాల జీఓలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

హన్మకొండ అర్బన్: 2021 జూన్‌లో విడుదల చేసిన షెడ్యూల్డ్ పరిశ్రమల ఐదు ప్రిలిమినరీ జీఓలను యథాతథంగా గెజిట్ చేయాలని, మిగిలిన 68 షెడ్యూల్డ్ పరిశ్రమల జీఓలను వెంటనే విడుదల చేయాలని, కనీస వేతనాల జీఓలను అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి కలెక్టరేట్ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. అనంతరం, హనుమకొండ డీఆర్‌ఓని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ కనీస వేతనాల సవరణకు సుప్రీంకోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకోవాలని, కనీస వేతనాల సలహా మండలి ప్రతిపాదనలు పక్కన పెట్టి కేబినెట్ సబ్ కమిటీ చేస్తున్న కాలయాపనకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన కార్మిక వ్యతిరేక చర్యను వీడి కనీస వేతనాలు పెంచాలని సూచించారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, జిల్లా నాయకులు ధరావత్ భాను నాయక్, ఆలకుంట యాకయ్య, యాస బాబు, దాసరి సమ్మయ్య, గోల్కొండ ఏసు, మౌనిక, శ్యామ్, మనోహర్, తిరుపతి, కార్మికులు పాల్గొన్నారు.

సార్వభౌమత్వాన్ని కాపాడుకుందాం



ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

రామన్నపేట: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద చర్యల నుంచి దేశాన్ని కాపాడుకుందామని కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. జాతీయ సంఘాల పిలుపులో భాగంగా ఆల్ ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో ఎస్‌కేఎం జిల్లా అధ్యక్షుడు రాచర్ల బాలరాజు అధ్యక్షతన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 50 శాతం సుంకాలను తమదేశంపై ట్రంప్ ఎందుకు విధించారో దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలోని ఖనిజ సంపద, సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా బీజేపీ ప్రభుత్వం కట్టబెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో కార్మిక, రైతు సంఘాల నాయకులు గన్నార రమేష్, ముక్కెర రామస్వామి, సోమిరెడ్డి శ్రీనివాస్, ఈసంపల్లి బాబు, అక్కనపల్లి యాదగిరి, నర్రా ప్రతాప్, వీరగోని శంకరయ్య, చిర్రా సూరి, తిరుపతి, కోరబోయిన కుమారస్వామి, మాలోత్ సాగర్, ఎండి.యాకూబ్, బొట్ల శ్రీనివాస్, సుంక మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

'దొంగ ఓట్లతో అధికారంలోకి బీజేపీ'



ర్యాలీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: దొంగ ఓట్లతోనే కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు ఆరోపించారు. ఈ నెల 20, 21, 22వ తేదీల్లో మేడ్చల్ జిల్లాలో జరగనున్న 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ హనుమకొండ వేయిస్తంభాల గుడి నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు పార్టీ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో బుధవారం బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ జేబు సంస్థగా కేంద్ర ఎన్నికల సంఘం మారిందని ఎద్దేవాచేశారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరు ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో పాలకులు కులం, మతం పేరుతో ప్రజలను విడదీస్తూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. ర్యాలీలో జిల్లా కార్యదర్శి కే.భిక్షపతి, నాయకులు సిరబోయిన కరుణాకర్, ఆదిరి శ్రీనివాస్, సదాలక్ష్మి, స్టాలిన్, టి.భిక్షపతి, ఎల్లేష్, లింగారెడ్డి, రాములు, లక్ష్మణ్, ఎం.భిక్షపతి, రాజమౌళి, సారంగపాణి, శంకర్ పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న రుద్రాక్షల ఎగ్జిబిషన్



కొనుగోలుదారుడికి రుద్రాక్ష అందజేస్తున్న దుర్గాప్రసాద్

హన్మకొండ: హనుమకొండ నక్కలగుట్టలోని రుద్రాక్షల ఎగ్జిబిషన్ నగర వాసులను ఆకట్టుకుంటోంది. ప్రజల నుంచి వస్తున్న స్పందనను చూసి ఈ నెల 18వ తేదీ వరకు ఎగ్జిబిషన్‌ను పొడిగించారు. ఈ ఎగ్జిబిషన్‌లో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలు, దక్షణావృత శంఖులు, నవరత్నమాలు, సాలిగ్రాంలు, కరుంగళి మాలలు, కరుంగళి వెండితో అల్లిన మాలలు అందుబాటులో ఉన్నాయి. ఈ సందర్భంగా రుద్రాక్షల ఎగ్జిబిషన్ నిర్వాహకుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నేపాల్ రుద్రాక్షలు ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉన్నాయని, పుట్టిన తేదీని బట్టి జాతకం పరిశీలించి జన్మరాశి, జన్మ నక్షత్రానికి సరిపడా రుద్రాక్షలు ఇవ్వనున్నట్లు వివరించారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సేవాలాల్ మహరాజ్‌కు పూజలు



సేవాలాల్‌ను దర్శించుకుంటున్న మహిళలు

మామునూరు: వరంగల్ 43వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీలో తీజ్ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ మేరకు సేవాలాల్ మహరాజ్ విగ్రహం వద్ద బంజారా కులస్తులు బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు మహిళలు శాస్త్రోక్తంగా బిందెల్లో నీళ్ల తెచ్చి సేవాలాల్‌కు విగ్రహాన్ని శుభ్రం చేసి వేడుకలు జరుపుకున్నారు.

కేడీసీలో తీజ్ ఉత్సవం

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోర్‌బంజారా తీజ్ ఉత్సవాన్ని కళాశాల ప్రిన్సిపాల్ గుర్రపు శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో బంజారా యువతులు తొమ్మిది రోజుల పాటు తీజ్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు తీజ్ ఉత్సవ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ శ్రీనివాస్, సభ్యుడు డాక్టర్ చిన్న తెలిపారు.

నిట్‌లో తిరంగా ర్యాలీ



తిరంగా ర్యాలీలో అధ్యాపకులు, విద్యార్థులు

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని క్యాంపస్‌లో తిరంగా ర్యాలీని బుధవారం ఘనంగా నిర్వహించారు. నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తిరంగా ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా నిట్‌లోని ప్రధాన భవనం నుంచి క్యాంపస్ చుట్టూ తిరంగా ర్యాలీని చేపట్టి ఐక్యతకు చిహ్నంగా నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఉద్యమం



హసన్‌పర్తి: మాట్లాడుతున్న ఏసీపీ నర్సింహారావు



కేయూ క్యాంపస్: వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, బోధన, బోధనేతర సిబ్బంది

హసన్‌పర్తి: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని హనుమకొండ ఏసీపీ నర్సింహారావు పిలుపునిచ్చారు. నగరంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్సై శ్రీకాంత్, ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి, ప్రొఫెసర్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: మాదక ద్రవ్యాల నిరోధక సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని కేయూలోని పరిపాలన భవనం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొని సామూహిక ప్రతిజ్ఞ చేసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

విద్యారణ్యపురి: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ప్రొహిబిషనల్ అండ్ ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్వర్లు సూచించారు. హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలల మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను విద్యార్థులతో చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు రాజ్‌కుమార్, దయాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో..

హనుమకొండ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞను డీఐఈఓ గోపాల్ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సవ్వాసి శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో..

రామన్నపేట: మాదక ద్రవ్యాలకు యువత దూరం ఉండాలని మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్‌రావు సూచించారు. కేంద్ర ప్రభుత్వ నిషా ముక్త్ భారత్ ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో మట్టెవాడ పోలీసుల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఎస్సై లచ్చయ్య, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

మడికొండ చౌరస్తాలో..

మడికొండ: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ కిషన్ సూచించారు. మడికొండలో మత్తు పదార్థాలపై అవగాహన ర్యాలీని మడికొండ చౌరస్తాలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రాజ్‌కుమార్, రాంమోహన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రామన్నపేట: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



మడికొండ: మడికొండ చౌరస్తాలో ప్రతిజ్ఞ చేస్తున్న పోలీసులు, స్థానికులు

ప్రజల ఇబ్బంది పట్టని ప్రభుత్వం: బీఆర్ఎస్



నయీంనగర్ నాలాను పరిశీలిస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: భారీ వర్షాలు కురిసి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ విమర్శించారు. హనుమకొండలోని వరద ప్రభావిత ప్రాంతాలను బుధవారం సందర్శించారు. 4వ డివిజన్‌లోని జ్యోతిబస్ నగర్, 5వ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ వద్ద నాలా, నయీంనగర్ నాలాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు నగరాన్ని వరద ముంచెత్తుతున్నా ప్రభుత్వం కనీస చర్యలు చేపట్టకపోవడం శోచనీయమన్నారు. నగరంలోని బస్తీలు నీట మునిగితే మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొనడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2020లో చరిత్రలో నగరం ఎన్నడూ చూడని వరదలు వస్తే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.250 కోట్ల ప్రత్యేక నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. రూ.75 కోట్ల వ్యయంతో సమ్మయ్య నగర్ నాలాను అభివృద్ధి చేశామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సంకు నర్సింగ్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు మనోజ్ కుమార్, సదాంత్, ప్రణయ్, రామ్మూర్తి, జయరాం, దశరథ్, మనోహర్, శ్యామ్, మహమూద్, రాంచందర్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

దేశభక్తి గేయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుడు సీహెచ్ రాములు రచించిన దేశభక్తి గేయాలు రాబోయే తరాలకు ఎంతో స్ఫూర్తినిస్తాయని హనుమకొండ డీఈఓ వాసంతి అన్నారు. హనుమకొండలోని లష్కర్‌బజార్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాములు రచించిన మహాగేయ ప్రస్థానం దేశభక్తి గేయాల పుస్తకాన్ని డీఈఓ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉమ, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, పీఆర్టీయూటీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి, జనరల్ సెక్రటరీ ఫలిత శ్రీహరి, బాధ్యులు ప్రభాకర్‌రెడ్డి, అజ్మీర ఝాన్‌సింగ్, డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ కార్యవర్గం ఎన్నిక

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ 2025 – 2028వ కాలానికి ఎన్నికలకు యూనివర్సిటీ అధికారులు ఇటీవల నోటిఫికేషన్ జారీ చేయగా, ఒక్కో పదవికి ఒక్కొరు చొప్పున నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ బుధవారం తెలిపారు. అధ్యక్షుడిగా జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఈసం నారాయణ, ఉపాధ్యక్షుడిగా పి.భాస్కర్, జనరల్ సెక్రటరీగా డాక్టర్ పుల్లా శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ (ఆర్గనైజేషన్) భూక్య రాజు, జాయింట్ సెక్రటరీ (రిక్రియేషన్)గా ఆర్.నరేష్, కోశాధికారిగా డి.ఆనందం, కార్యవర్గ సభ్యులుగా వెంకటనర్సయ్య, ఎం.బుచ్చయ్య, బొక్క మొగిలి, మహర్షి, ప్రభాకర్, మానుపటి రాజేష్, ఐ.శ్రీకాంత్, సేవ్యా, డాక్టర్ బి.శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

కాకతీయ వైద్య కళాశాల సబ్ స్టేషన్ తనిఖీ

హన్మకొండ: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని విద్యుత్ సబ్ స్టేషన్, ప్రధాన మంత్రి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి అందుతున్న విద్యుత్ సరఫరాను టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతమ్ రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. వర్షాల నేపథ్యంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి విద్యుత్ అంతరాయం కలుగకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ రోషన్‌కు సూచించారు. కరెంట్ పోయిన వెంటనే ఆటోమేటిక్‌గా పనిచేసే జనరేటర్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్, ఏడీఈ టి.సురేష్, ఏఈ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ బాధిత పిల్లలకు అండగా లోడి సంస్థ

కాజీపేట రూరల్: హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు లోడి సాంఘిక సేవా సంస్థ (లోడి మల్టీపర్పస్ సోషల్ సర్వీస్ సొసైటీ) అండగా ఉంటోందని కాజీపేట లోడి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ సింగారెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. ఫాతిమానగర్‌లోని లోడి సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 1వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదివే 200 మంది హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ, స్టేషనరీ కిట్లను ఇన్నారెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవిత ప్రయాణంలో హెచ్ఐవీ బాధితులు అధైర్య పడకుండా, మనోధైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో నర్సంపేట క్యాథలిక్ చర్చి విచారణ గురువు బాసాని ప్రకాష్, లోడి సంస్థ అడ్మినిస్ట్రేటర్ సిస్టర్ టెస్సిన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్లు ఎల్.వీరబాబు, కె.సురేష్, టీం సభ్యులు అనిత, శిరీష, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

కాజీపేట అర్బన్: గుండె నొప్పితో బాధపడుతున్న 71 ఏళ్ల వృద్ధుడికి ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండా అరుదైన టీఏవీఐ శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు మెడికవర్ చీఫ్ ఆఫ్ కార్డియాలజీ డాక్టర్ ప్రమోద్‌కుమార్ కుచులకంటి తెలిపారు. హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఆస్పత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వృద్ధుడు మూడేళ్లుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చాతి నొప్పి సమస్యలతో బాధపడుతూ ఇటీవల మెడికవర్ ఆస్పత్రికి వచ్చినట్లు తెలిపారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం వృద్ధుడికి కాల్షిఫిక్ ఎయోర్టిక్ స్టెనోసిస్ (గుండెలోని ప్రధాన కవటం ఇరుకుగా మారి, కాల్షియం పేరుకు పోవడం)గా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వృద్ధుడికి ఓపెన్ హార్ట్ సర్జరీ కాకుండా అరుదైన టీఏవీఐ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు డాక్టర్ ప్రమోద్‌కుమార్ వివరించారు.

16న త్రిభాషా కవి సమ్మేళనం

న్యూశాయంపేట: వరంగల్ అదాబ్ – ఏ –ఇస్లామీ ఆధ్వర్యంలో ఈ నెల 16న త్రిభాషా (తెలుగు, ఉర్దూ, హిందీ) భాషల్లో ప్రజాస్వామ్యం – సంఘీభావం అనే శీర్షికపై (ముషాయిరా) కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు ఇక్బాల్ దర్ద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ పోచమ్మమైదాన్ టెలిఫోన్ భవన్ వెనుక ఉన్న ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం కవి సమ్మేళనం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమ్మేళనంలో హైదరాబాద్, కాగజ్‌నగర్, కరీంనగర్, మంచిర్యాల, వరంగల్ జిల్లాలకు చెందిన కవులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కాజీపేట: వర్షాకాలంలో సోకే వ్యాధుల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ హెల్త్ సెంటర్ డాక్టర్ అనిత సూచించారు. సోమిడి పట్టణంలోని పలు ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి అనిత బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. మురుగునీటి గుంతలు, నీరు నిల్వ ఉన్న చోట దోమలు వ్యాప్తి చెంది మలేరియా వ్యాధి సోకుతుందన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. పలు సూచనలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు.

పెన్షనర్లకు జూలై పింఛన్ చెల్లించండి

రామన్నపేట: రాష్ట్రంలోని 32 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల్లోని పెన్షనర్లకు జూలై నెల పింఛన్‌ను తక్షణమే చెల్లించాలని మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం (ఎస్‌జీపీఏటీ) వరంగల్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ వీరయ్య, సాంబయ్య డిమాండ్ చేశారు. జూన్ నెల పింఛన్లు ఇప్పటివరకు ఖమ్మం, భద్రాచలం, వేములవాడ, అచ్చంపేట మార్కెట్ కమిటీల పెన్షనర్లు పొందలేదని తెలిపారు.

పరిశోధన గ్రంథం ఆవిష్కరణ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ హిస్టరీ విభాగానికి చెందిన డాక్టర్ పోతరవేణి తిరుపతి రచించిన హిస్టరీ అండ్ కల్చర్ ఆఫ్ గొల్లాస్ ఆఫ్ తెలంగాణ అనే పరిశోధన గ్రంథాన్ని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మనోహర్, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, తిరుపతి పాల్గొన్నారు.

అవయవ దానానికి అంగీకారం

నయీంనగర్: ఆగస్టు 13న అవయవ దానం దినోత్సవం సందర్భంగా ఆదర్శకాలనీకి చెందిన మర్రిపెల్లి కవిత, బ్రాహ్మణవాడకు చెందిన మార్కండేయ తమ మరణానంతరం తమ దేహాలను కాకతీయ మెడికల్ కళాశాలకు అందజేయడానికి అంగీకారం తెలిపారు. ఈ మేరకు తమ సంతకం చేసిన అంగీకార పత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ప్రతినిధులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, ప్రధాన కార్యదర్శి టి.జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు వైద్యం రాజగోపాల్, సుమలత పాల్గొన్నారు.

కలశయాత్రను విజయవంతం చేయండి

నయీంనగర్: అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న బిహార్‌లో ప్రారంభమై ఈ నెల 14న ఉమ్మడి వరంగల్ జిల్లాలోకి ప్రవేశించనున్న రేజంగ్ల రాజ్ కలశయాత్రను విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడు గిరిబోయిన రాజ్యయాదవ్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కుమార్ యాదవ్, బంక సంపత్‌యాదవ్, చెన్నమల్లు యాదవ్, సమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని చెరువు కట్టపై ఉన్న కట్టమైసమ్మ పునఃనిర్మాణ పనులను కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ బుధవారం ప్రారంభించారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పిట్టల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జన్ను కిషన్, కన్వీనర్ పెద్దమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.